తగ్గుతున్న పాల దిగుబడి

- పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు
- వేధిస్తున్న పశుగ్రాసం కొరత
- ఉత్పత్తిదారులకు రెండేళ్లుగా అందని బోనస్
- డెయిరీల్లో విక్రయానికే మొగ్గు చూపుతున్న ఉత్పత్తిదారులు



జమలాపురంలో డెయిరీలో పెంచుతున్న పాడి గేదెలు

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో పాల దిగుబడి రోజురోజుకు తగ్గుతోంది. మండుతున్న ఎండలు, వడగాల్పుల కారణంగా పాల దిగుబడి తగ్గుతుందని పలువురు వాపోతున్నారు. మరో వైపు పచ్చిగడ్డి కొరత కూడా అధికంగా ఉంది. దీంతో ప్రభుత్వ,ప్రవేటు డెయిరీలు పాలఉత్పత్తులు నడుపుతున్న వారు నష్టాలను చవిచూస్తున్నారు. కావున రైతులు పశువులను పెంచేందుకు ఆసక్తి కనబరచడం లేదు. పశువులకు వేసే దాణా ధరలు కూడా విపరీతంగా పెరగడంతో పశుపోషణ ప్రియమైందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం సైతం కనిపించడం లేదు. మండలంలో టీఎస్ డైరీతో పాటు మరో రెండు ప్రైవేట్ డైరీలున్నాయి. ప్రస్తుతం టీఎస్ డైరీకి రోజుకు 900 లీటర్ల పాలు సరఫరా అవుతుండగా, రెండు ప్రైవేట్ డైరీల్లో 1,900 లీటర్ల వరకు వస్తుంది. గత సంవత్సరంతో పోలిస్తే సగానికి సగం మేరకు ఉత్పత్తులు పడిపోయాయి. దీనికి తోడు గడిచిన రెండేళ్లుగా పాల ఉత్పత్తిదారులకు టీఎస్ డైరీ నుంచి ఒక్క రూపాయి కూడా బోనస్‌లు చెల్లించలేదు.

పశుగ్రాసం కొరత..

పాడి గేదెల పెంపకందారులకు పశువుల మేత కూడా దొరకడం లేదు. పంట పొలాల్లో అధికంగా పురుగుమందు వాడకంతో పచ్చి మేత సేకరణ ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఒకప్పుడు పశువుల మేతకు కేటాయించిన బీడు భూములు రియల్ ఎస్టేట్ కారణంగా ధరల విపరీతంగా పెరగడంతో ఆ భూములు సైతం సాగు భూములుగా మారాయి. ఎండు గడ్డి ఎకరానికి రూ.12 వేల వరకు ధర పలకడంతో కొనుగోలు కష్టంగా మారింది. దీంతో పశువుల పెంపకందారులు పాల ఉత్పత్తులకు బోనస్ చెల్లించక పోగా గేదెలను పెంచడానికి ఆసక్తి కూడా కనబరచడం లేదు.

ఏపీలో లీటర్‌కు రూ.5ల అధికం..

ఏపీలో పాల ఉత్పత్తిదారుల నుంచి 10 వెన్నశాతం ఉన్న ఒక లీటర్ రూ.78 ఏపీ డైరీ చెల్లిస్తుంది. ప్రతి రూ.100కి రూ.15 చొప్పున 4 నెలలొకోమారు బోనస్ చెల్లిస్తూ పాల సేకరణ చేస్తుంటారు. టీఎస్ డైరీ మాత్రం లీటర్‌కు రూ.73లు మాత్రమే ఉత్పత్తిదారులకు చెల్లిస్తుంది. బోనస్ కూడా గత రెండేళ్లుగా ఇవ్వడం లేదు.

ఏపీ డెయిరీలకే విక్రయిస్తున్నారు..



ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లో ఉత్పత్తిదారులకు చెల్లించే పాల ధరలో రూ.5 తేడా ఉంది. దీంతో ఏపీ సరిహద్దు గ్రామాల్లోని ఉత్పత్తిదారులు అక్కడి డైరీలకే పాలను విక్రయిస్తున్నారు. దీనికి తోడు పశుగ్రాసం కొరత. ఈ కారణంగా పెంపకందారులు పాడి ఉత్పత్తిపై ఆసక్తి చూపడం లేదనేది వాస్తవం.

– సామినేని ఉపేంద్ర,
టీఎస్ డైరీ ఇన్‌చార్జ్, ఎర్రుపాలెం

పాల ఉత్పత్తులు బాగా తగ్గాయి..



పాలకేంద్రానికి రోజుకూ 250 లీటర్లు మాత్రమే పాలు వస్తున్నాయి. గత సంవత్సరమైతే 450 లీటర్ల వరకు సేకరించడం జరిగింది. రెండేళ్లుగా బోనస్ ఇవ్వడం లేదని ఉత్పత్తిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా టీఎస్ డైరీ ఏపీలో మాదిరిగా బోనస్ చెల్లిస్తే ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.

– ఆవుల ముత్తయ్య,
పాలసేకరణదారుడు, తెల్లపాలెం

దాణా రేట్లు బాగా పెరిగాయి..



పాడి గేదెల పెంపకం చాలా కష్టంగా ఉంది. వాటి ద్వారా వచ్చే సంపాదన వాటి మేతకు కూడా సరిపోవడం లేదు. ఎకరా వరి గడ్డికి రూ.12వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. దాణా రేట్లు కూడా బాగా పెరిగాయి. పాల ధరలు పెట్టుబడికి అనుగుణంగా లేవు. పాడి గేదెల పెంపకం గిట్టుబాటు కావడం లేదు.

– శ్రీపాలశెట్టి వెంకటేశ్వరరావు,
పాడిరైతు, ఎర్రుపాలెం

క్లుప్తంగా

దళారులను నమ్మి మోసపోకండి

కొణిజర్ల/ఏన్కూరు: రెండో విడత దళితబంధు పథకం ఇప్పిస్తామంటూ చెబుతున్న దళారులను నమ్మి మోసపోవద్దని కొణిజర్ల, ఏన్కూరు ఎంపీడీఓలు ఆర్.రమాదేవి, బయ్యారపు అశోక్ సూచించారు. మండల కేంద్రాదల్లో గురువారం వారు మాట్లాడారు. ప్రభుత్వం రెండో విడత దళితబంధు పథకం అమలుకు ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయలేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చే వరకు దరఖాస్తులు తీసుకోబోమని, ఈ విషయంలో ఎవరైనా మధ్యవర్తులు నమ్మబలికితే డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు.

మహిళలకు ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైరా మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులకు గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం మహిళలకు కబడ్డీ, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిత, కౌన్సిలర్లు మాదినేని సునీత, గుగులోత్ లక్ష్మీబాయి, మెప్మా, ఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ఏన్కూరు: మండలంలో వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా భగవాన్‌నాయక్ తండలో ఇటీవలే మృతి చెందిన బానోత్ నవీన్ కుమార్ కుటుంబాన్ని ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యేలు బానోత్ చంద్రావతి, బానోత్ మదన్‌లాల్ పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గుగులోత్ సోమ్లు కుటుంబాన్ని ఎమ్మెల్యే రాములు నాయక్ పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ సురేష్‌నాయక్, భూక్య లాలునాయక్, ధర్మారావు, కాంతి, కృష్ణప్రియ, శ్రీకాంత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నవ్యకాంత్

కల్లూరు: కల్లూరులోని గోపాలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణులకు డాక్టర్ నవ్యకాంత్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే సాధారణ కాన్పులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రేవతి, ఏఎన్ఎం రజని, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

కల్లూరు: కల్లూరులోని శ్రీసాయిరామ ధ్యాన మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖవైద్యులు నవీన్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి బలరామ్, కోశాధికారి బాలాజీ, శ్రీనివాస్, మొరళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురంలో గురువారం 25కేవీ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ బొక్కా అరుణతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ మాట్లాడుతూ.. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కృషితో విద్యుత్ సమస్య గ్రామంలో తొలగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమాదేవి, నాయకులు కాశేశ్వరరావు, నాగేశ్వరరావు, జనార్ధన్‌రెడ్డి, కోటిరెడ్డి, రమేష్, రామచందర్‌రావు, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

విద్యా వలంటీర్‌కు వేతనం అందజేత

కల్లూరు రూరల్: మండలంలోని పెద్దకోరుకొండి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వలంటీర్‌కు గ్రామస్తులు విరాళాలు సేకరించి రూ.5,000లు వేతనం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్తమ్మ, హనుమంతరావు, గ్రామ కార్యదర్శి మౌనిక, ఉపాధ్యాయులు రాజు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీఅంకమ్మతల్లి ఆలయం



శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో శ్రీఅంకమ్మతల్లి దేవాలయంలో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం తెల్లవారు జామున అత్యంత వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో, అర్చకులు మునగలేటి రమేషశర్మ పర్యవేక్షణలో శ్రీవిమాన నాగేంద్రస్వామి, పోతురాజు సహిత శ్రీమహాలక్ష్మీ, అంకమ్మ, పెద్దమ్మతల్లి, మద్దిరావమ్మ అమ్మవార్ల పునఃప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమలాపురం, అయ్యగారిపల్లి గ్రామాల్లో ప్రభల ఊరేగింపు నిర్వహించి, రావిచెట్టు వేపచెట్లకు కల్యాణం నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయంలో అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, గుంటూరు పద్మనాభాచార్యులు, సురేష్‌శర్మలు శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కమలాపురం, అయ్యగారిపల్లి, అమ్మపేట గ్రామాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణ క్రతువు తిలకించడానికి భారీగా తరలి వచ్చారు.

చట్టాలపై అవగాహన

వైరారూరల్: వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళల పాత్ర కీలకమైందని, మహిళలు లేకపోతే సృష్టే లేదని తెలిపారు. ఈ సందర్భంగా పలు రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ ధనమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ అనిత, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఓ శ్యాంకుమార్, ఎంపీఓ జ్యోత్స్నదేవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, పి.మాలతి, షేక్.బిజాన్‌బీ, పి.సరిత తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కల్లూరు: కల్లూరు మండల లారీ అండ్ డీసీఎం ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ గురువారం స్థానిక లారీ యూనియన్ ఆఫీస్ వద్ద ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పాశం నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా దూబకుంట్ల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా తెళ్లూరి సత్యం, కోశాధికారిగా మాడిశెట్టి సురేష్, గౌరవ అధ్యక్షులుగా ఉస్మాన్, తురాబల్లి, మాడిశెట్టి నాగరాజు, ముఖ్య సలహాదారులుగా పసుపులేటి కోటేశ్వరరావు, నీలం వెంకట్రావ్, మిద్దె నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న బిక్కి కృష్ణ ప్రసాద్

మధిర: మధిర రైతు సేవా సహకార సంఘం పరిధిలో ఉన్న పలువురు లబ్ధిదారులకు గురువారం ఆ సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. మడుపల్లి గ్రామానికి చెందిన చలు వాది రామకృష్ణ మృతి చెందగా నామిని నాగమణికి రూ.50 వేల చెక్కును అందించారు. అదేవిధంగా మల్లారం గ్రామ పరిధిలోని కరివేద నాగమణికి రూ.50 వేల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ సంఘంలో సభ్యత్వం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ రవికుమార్, సూపర్ వైజర్ శివరామకృష్ణ, సహకార సంఘం సీఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది సుబ్బారావు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



మధిర: ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మధిర/కల్లూరు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ కోసం జరిగిన అర్హత పరీక్షలో మధిరలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు, కల్లూరులోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ వలి, కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం, చంద్రుపట్ల హైస్కూల్ హెచ్ఎంలు జి.మాధవరావు, వనదుర్గ, ఎం.అమర్నాధ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షల్లో ఎంపికైన దునుకు అఖిల్, యలమద్ది వరుణ్ సందేశ్, నల్లబోతుల రమ్య, తోటకూర అరవింద్, వేల్పుల శరణ్య, బొగ్గుల ఈశ్వర్‌రెడ్డి, వి.చెస్మిత, రామిశెట్టి లక్ష్మీసాత్విక, మూడ్ నీలేష్ నాయక్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హరిప్రసాద్

ముదిగొండ: ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లను ఎంపీపీ సామినేని హరిప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీతో బాధపడుతున్న వారు మందులతోపాటు పౌష్టికాహారం తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి అరుణాదేవి, సీహెచ్ దుర్గామల్లేశ్వరి, పీహెచ్ఎన్ నాగమణి, సూపర్‌వైజర్ లత, ల్యాబ్ టెక్నీషియన్ వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి

వైరారూరల్: వైరా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా తల్లాడ ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి గురువారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 15వ తేదీ నుంచి శిక్షణలో భాగంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా బుధవారం వరకు వైరా ఎంపీడీఓ బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె ఖమ్మం ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యాన తల్లాడ ఎంపీఓ శ్రీదేవిని వైరా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా జిల్లా ఉన్నతాధికారులు నియమించడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ పోస్టుకు ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. కావున 12న సాయంత్రంలోగా తమ బయోడేటాను అందించాలని కోరారు.

రోడ్డు పనులు పూర్తి చేయరా..?

- పల్లిపాడు, ఏన్కూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో
- జంపాలనగర్ నుంచి మేకలకుంట వరకు పాదయాత్ర



జంపాలనగర్ నుంచి పాదయాత్ర చేస్తున్న గిరిజనులు

కొణిజర్ల: మండలంలోని మేకలకుంట నుంచి జంపాలనగర్ వరకు ఐటీడీఏ భద్రాచలం వారి నిధులతో మంజూరైన బీటీ రోడ్డు పనులు ఐదేళ్లు గడిచినా పూర్తి కాలేదని గిరిజనులు గురువారం పాదయాత్ర నిర్వహించారు. పల్లిపాడు ఏన్కూరు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అధికారులు వచ్చి తమకు హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న రోడ్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిలిచి పోయిందని, భద్రాచలం ఐటీడీఏ అధికారులకు ఎన్నిసార్లు నివేదించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వారంలోగా పనులు ప్రారంభించకపోతే గ్రామస్తులంతా ఖమ్మం కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ హరిచంద్, భూక్యా సక్రునాయక్, ధరావత్ బాబూలాల్, భూక్యా లక్ష్మణ్, అశోక్, నవీన్, అనిల్ దుర్గాప్రసాద్, సురేష్, సంపత్, రంగమ్మ, అమ్మి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలను తొలగించండి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఎమ్మెల్యే సండ్రతో కలిసి తల్లాడ, కల్లూరు మండలాల్లో పర్యటన



తల్లాడ : ప్రభుత్వ ఆస్పత్రి మరమ్మతు పనులను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర



కల్లూరులో మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

తల్లాడ/కల్లూరు: తల్లాడ మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన ఎన్నెస్పీ భవనాలను వెంటనే తొలగించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. తల్లాడ మేజర్ గ్రామపంచాయతీకి సీఎం కేసీఆర్ హామీతో ఇటీవల రూ.10 కోట్లు మంజూరు కాగా, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మరమ్మతు పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆతర్వాత శిథిలావస్థకు చేరిన ఎన్నెస్పీ భవనాలను ఒలగించాలని ఆదేశించగా.. ఆ స్థలాన్ని కూరగాయలు, నాన్‌వెజ్ మార్కెట్‌కు కేటాయించాలని ఎమ్మెల్యే, స్థానికులు కోరారు. గ్రంథాలయ భవనం, వాలీబాల్ కోర్టుకు కేటాయించిన స్థలం, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కాగా, తల్లాడ రింగ్ వెడల్పు తగ్గించాలని, తల్లాడ, మల్లవరంల్లో తాగునీటి ఎద్దడి, తల్లాడలో కోతుల సమస్యపై స్థానికులు, సాగర్ జలాలు అరకొర సరఫరాపై బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, డీఎల్పీఓ ప్రభాకర్, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి, తహసీల్దార్ గంటా శ్రీలత, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, పీఆర్ డీఈ రాంబాబు, ఏఈ అశోక్, ఎంపీఓ శ్రీదేవి, ఈఓ ఉష, సీఐ సురేష్, ఎస్ఐ సురేష్, ఏఓ తాజుద్దీన్, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇక కల్లూరులో కూడా కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించి వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల ఏర్పాటుకు పాత బస్టాండ్, పోలీస్‌స్టేషన్ ఆవరణ, ఎన్నెస్పీ స్థలాలను పరిశీలించారు. కాగా, కలెక్టర్ వచ్చిన విషయం తెలుసుకున్న పలువురు డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని విన్నవించేందుకు రాగా తొలుత పోలీసులు అడ్డుకున్నారు. ఆతర్వాత సీఐ హనూక్, ఎస్ఐ పి.రఘు వారిని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లగా అర్హులైన నిరుపేదలకు రూ.3 లక్షల పథకం అమలులో ప్రాధాన్యత కల్పించనున్నట్లు చెప్పారు. సర్పంచ్ లక్కినేని నీరజ, ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, జెడ్పీ సీఈఓ అప్పారావు, ఈఈ చంద్రమౌళి, డీఈలు ఆర్.రాంబాబు, శంకర్, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీఓ వీరస్వామి, నాయకులు పాలెపు రామారావు, డాక్టర్ లక్కినేని రఘు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు

మధిర: పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మీరాఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మధిర డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పెన్షనర్ల డిమాండ్ల సాధన కోసం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మధిర తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెలా పెన్షన్ మంజూరులో జాప్యం జరుగుతుందని దీంతో పెన్షనర్లు వైద్య ఖర్చులు, ఇంటి అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతి అందించిన వారిలో పెన్షనర్లు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, సునీల్ కుమార్, శర్మ, సుబ్బరాజు ఉన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కల్లూరు రూరల్: ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ బీరవెల్లి రఘు కోరారు. గురువారం తన చాంబర్‌లో ఎంపీడీఓ, ఈజీఎస్ అధికారులకు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలకు వెంటనే వేతనాలు అందించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కట్టుగుడ్డలు, తాగునీరు లాంటి సౌకర్యాలు తప్పని సరిగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఈజీఎస్ ఏపీఓ, ఈజీఎస్ జేఈఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న పర్సా పట్టాభిరామారావు

కారేపల్లి: విద్యార్థులు విద్యావంతులుగా ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీకోటమైసమ్మతల్లి దేవాలయం ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలంలు అన్నారు. గురువారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సాంస్కృతిక వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా రూ.25వేలు విలువ చేసే ఎంసెట్ స్టడీ మెటీరియల్స్‌ను పర్సా పట్టాభిరామారావు విద్యార్థులకు అందించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కారేపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సురేష్‌బాబ్, మంజుల దంపతులు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాచలం, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, వనిత, యాకయ్య, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న కిష్టారం ఓసీ పీఓ నర్సింహారావు

సత్తుపల్లిరూరల్: మండలంలోని ఓసీ ప్రభావిత గ్రామం కిష్టారంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.12,300 విలువైన నోటు పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ ఆదేశాల మేరకు కిష్టారం ఓసీ పీఓ వి.నర్సింహారావు ఈ నోటు పుస్తకాలను అందించడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ రేణుకఈశ్వర్, గ్రామ పెద్దలు అప్పారావు, హెచ్ఎం ప్రభుదాస్, ఉపాధ్యాయులు జి.రామకృష్ణ, బి.కుమారి, సంక్షేమాధికారి విజయ్ సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత..

వైరారూరల్: మండలంలోని గన్నవరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు కావాల్సిన పలు రకాల ఆట వస్తువులను విద్యార్థులకు అందించారు. ప్రభుత్వం కేటాయించిన స్పోర్ట్స్ గ్రాంట్ నిధులు రూ.10 వేలతో కొనుగోలు చేసి విద్యార్థులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేమిరెడ్డి విజయలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ కోటిరెడ్డి, హెచ్ఎం కూరాకుల సైదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మురుగు తొలగించండి సారూ..?



ముదిగొండ మండలంలోని గోకినేపల్లిలో ఏ వీధిలో చూసిన మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉంది. మరికొన్ని కాలువల్లో మురుగుతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు విజృంభించి అల్లాడిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉండడంతో పాటు పంచాయతీ పాలకవర్గం, అధికారులు పర్యవేక్షించి పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని ప్రజలు కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి :
– సతీష్, పంచాయతీ కార్యదర్శి గోకినేపల్లి
సెల్ నంబర్ : 9502627990